తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

బంగారు పెద్ద శేషవాహనంపై

# గణనాథుని వైభవం



కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:
కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి సిద్ధి బుద్ధి సమేత వరసిద్దుడు బంగారు పెద్దశేషవాహనంపై అధిరోహించి కాణిపాకం గ్రామ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఉదయం చిన్న శేషవాహనసేవను నిర్వహించగా రాత్రి స్వామివారికి బంగారు పెద్దశేషవాహనసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, కాకర్లవారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టయిండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాదుల కమ్మవ ంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు రాత్రి దేదీప్యమానంగా అలంకరించిన స్వామి అమ్మవార్లను అలంకారమండపంలో వుంచి వేదపండితుల మత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వివిధరకాల పుష్పాలతో మిరమిట్లు గొలిపేరీతిలో అలంకరించిన బంగారు పెద్దశేషవాహనంపై వుంచి రాష్ట్రంలోని ప్రఖ్యాత కళాకారులచే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా గ్రామస్థులు, భక్తులు నారికేళ కర్పూర హారతులతో మొక్కులు తీర్చకున్నారు. ఈకార్యక్రమంలో పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్‌మోహన్, ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, డిప్యూటీ ఈఓ కె.వాణి, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు రవి, విఘ్నేష్, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న ప్రత్యేక అలంకరణలు





కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం జరిగిన చిన్న శేషవాహనసేవ, బంగారు పెద్ద శేషవాహనసేవ సందర్భంగా ఉభయదారులచే ఆలయంలో చేపట్టిన ప్రత్యేకాలంకరణ ఎంతో ఆకట్టుకుంది. ప్రధాన ఆలయంలోని, అన్వేటిమం డపం, అలంకారమండపం, సుపథమండపంలతో పాటు ప్రధాన ఆలయాన్ని వివిధరకాల పుష్పాలు, అరటిచెట్లు, మామిడితోరణాలతో ప్రత్యేకంగా అలంకరి ంచారు. అలాగే ఆలయంలోని బంగారు ద్వజస్థంభాన్ని స్వదేశీ, విదేశీజాతి పుష్పాలతో దేధీప్యమానంగా అలంకరించారు.

# గోవిందుని దర్శనం ఆనందంగా ఉంది

## కర్నాటక గవర్నర్ థవర్‌చంద్‌గెహ్లాట్



తిరుమల, సెప్టెంబర్11ప్రభాతవార్తప్రతినిధి:
కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి దర్శనం బాగా జరిగిందని కర్నాటక గవర్నర్ థవర్‌చంద్‌గెహ్లాట్ సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం ఆయన విఐపి బ్రేక్‌లో శ్రీవారి సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, డిప్యూటీ ఇఒ భాస్కర్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# మెగా పనుల్లో ఇష్టారాజ్యం : రైతులకు శాపం

## చెరువుల్లో పిల్లర్లు: మూసివేసిన పంటకాలువలు

తొట్టంబేడు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త
నాయుడుపేట-రేణిగుంట మధ్య 6లేన్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన మెగా కంపెనీ ఇష్టారాజ్యంగా వ్యవహరించటం వారికి అనుసంధాన కర్తగా వ్యవహరించిన శాసనసభ్యుడి వత్తిడితో రైతులు తిప్పలు పడుతున్నారు. సుమారు రూ. 1800కోట్లతో చేపట్టిన పనుల్లో మొదట రూపొందించిన ఎలైన్‌మెంట్ ప్రకారం కాకుండా గ్రామాల వద్ద రైతులు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకుండా చేయటంతో 'నేడు రైతులకు శాపంగా' మారింది.కొన్ని గ్రామాల్లో చెరువుల్లోంచి మట్టి తీసివేయటంతో చెరువులు సముద్రాలుగా మారాయి. దాంతో చెరువులకు నీళ్ళు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.మరి కొన్ని చెరువుల్లో పిల్లర్లు రావటంతో ఇబ్బందిగామారింది, కొన్ని గ్రామాల వద్ద పంట కాలువలు మూసివేయటంతో గ్రామాలు మునిగిపోయే ప్రమాదం చోటు చేసుకుంది.

**ముంపుకు గురి కానున్న పొయ్య:**

నాయుడుపేట-రేణిగుంటల మధ్య 6లేన్ల రోడ్డు నిర్మాణాలు ప్రయాణానికి అనుకూలంగా మారనుంది. ఈ పనులను 'మెగా కంపెనీ' చేపట్టింది.అయితే ఈ పనులతో కొన్ని చోట్ల తెలుగుగంగ నుంచి సాగునీరందించే పంట కాలువ కాజ్‌వే మూసి వేసారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తెలుగుగంగ కాలువ నుంచి స్వర్ణముఖి చెంబేడు కాలువ ద్వారా 34 చెరువులకు సుమారు 10400 ఎకరాలకు సాగునీరందిస్తుంది. ఈ చెంబేడు కాలువను శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి గెలుపొందిన నీలం సంజీవరెడ్డి



చెంబేడు కాలువకు అమర్చిన లాక్స్,



మెగా రోడ్డుతో పూడిపోయిన చెంబేడు కాలువ కాజ్‌వే

ముఖ్యమంత్రిగా పదవి పొందటంతో నియోజకవర్గంలోని రైతులకు వరంగా 'స్వర్ణముఖి ఆనకట్టను నిర్మించి చెరువులకు నీరందించుటకు చెంబేడు కాలువ నిర్మించారు. ఈ కాలువను 2007లో జపాన్ నిధులు రూ.18కోట్లతో ఆధునీకరించారు. అయితే ప్రస్తుతం మెగా కంపెనీ చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో చెంబేడు కాలువ పొయ్య గ్రామం వద్ద ఏర్పాటు చేసిన లాగ్స్ దెబ్బతిన్నాయి. గోడలను ధ్వంసం చేసారు.రోడ్ క్రాస్ చేసే సమయంలో కాజ్‌వే మూసివేసారు.ఇక్కడ లాగ్స్‌కు మంచినీటి లిఫ్ట్ తొట్టెలు ఇరిగేషన్‌శాఖ నిర్మించింది.వాటిని ధ్వంసం చేసింది.ఈ సమస్యను పలుమార్లు ఇరిగేషన్ ఇఇ దృష్టికి తెచ్చారు.కానీ గత ఐదేళ్ళలో పాలకులు నీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేయటంతో సమస్యలు చోటు చేసుకున్నాయి.ఈ నేపథ్యంలోనే చెంబేడు కాలువకు సంబంధించి మెగా పనులతో గ్రామాలు మునిగిపోనున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లు వేయటం మంచిదే కానీ దాంతో సాగునీటికి విఘాతం కల్పించటంతో రైతుల్లో ఆందోళన చోటు చేసుకుంది.ఇప్పటికైనా పలు రాష్ట్రాల్లో ప్రకృతి సృష్టిస్తున్న జల విలయ తాండవాన్ని గుర్తించుకొని ముందు జాగ్రత్తలు ఎంతో అవసరం వర్షాలకు ముందే మెగా పాపానికి పరిష్కారాన్ని ఇరిగేషన్‌శాఖ పరిష్కరించుకోకుంటే పొయ్య, దళితవాడలతో పాటు కొమ్మన గుంట, నెలబల్లి చెరువు పరిధిలోని పంట పొలాలు మునిగిపోయే ప్రమాదం పొంచి ఉంది.

# బ్రహ్మోత్సవాలకు గ్యాలరీలు సిద్ధం

## -ఇనుపకంచెలతో మాఢవీధులు భద్రత





ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమలకొండ సిద్దమవుతోంది. ఇప్పటికే ఆలయం పరిసరాలు ,మాఢవీధులు రంగురంగుల రంగవల్లులు, అదనపు తాగునీటికొళాయిలు, మరుగుదొడ్లు సౌకర్యం కల్పించే పనులు మొదలయ్యాయి. మాఢవీధులు పూర్తిగా గ్యాలరీలతో ఇనుపకంచెల బందీగా మారిపోయింది. ఈ ఏడాది వెంకన్నకు అక్టోబర్ 4వతేదీ నుండి 12వరకు తొమ్మిదిరోజులపాటు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదిరోజులు పాటు ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8గంటలకు ప్రారంభమవుతుంది. రాత్రి వాహనసేవ 7గంటలకు జరగనున్నాయి. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, టిటిడి సిఇ సత్యనారాయణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ,టిటిడి అధికారులు కూడా తగిన ప్రణాళికలు సిద్దం చేస్తున్నారు. ఆలయం ముందు గ్యాలరీలకు ఇనుపకంచెలు ఏర్పాటుచేశారు.

# వినాయకుడికి సాగర్‌లో వీడ్కోలు



తిరుపతి, సెప్టెంబర్ 11ప్రభాతవార్త:
తిరుపతినగరంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి బుధవారం మధ్యాహ్నం నుండి ఆయా నిర్వాహకులు రూట్‌మ్యాప్‌మేరకు తరలించారు. మధ్యాహ్నం నుండి అనేక కాలనీల్లో ఏర్పాటుచేసిన పలు రకాల వినాయకప్రతిమల విగ్రహాలను ఊరేగింపుగా, బాణాసంచాలు కాల్చుతూ తరలించారు. నగరంఅంతా జై గణేశా...బైబై గణేశా... అంటూ రంగులు చల్లుకుంటూ లీలామహల్ కూడలికి చేరుకున్నారు. అక్కడ వరసిద్దివినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, ఎంఎల్‌సి డాక్టర్ సుబ్రమణ్యం, సభ్యులు గుండాల గోపీనాథరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, నరసింహయాదవ్, వరప్రసాద్, భాస్కర్ తదితరులు స్వాగతం పలికారు. విగ్రహాలకు వీడ్కోలు నీరాజనం చెప్పారు. రాత్రివరకు సుమారు 250వరకు విగ్రహాల నిమజ్జనం జరిగింది. వినాయకసాగర్ వద్ద తిరుపతి డిఎస్పీ జొన్నలగడ్డ వెంకటనారాయణ, అలిపిరి సిఐ రామ్‌కిశోర్, పోలీసులు గట్టి భద్రత నడుమ ప్రశాంతంగా విగ్రహాల నిమజ్జనం చేపట్టారు.

# హిందూముస్లిం భాయ్‌భాయ్

**అందరి పండగగా ముగిసిన వేనాడు అల్లాతాత గంధోత్సవం**
**బుధవారం ఉదయం గంధం పంచిన హిందూ యువకులు**
**- దర్గాను దర్శించుకున్న పలువురు ప్రముఖులు**





అల్లాతాత సమాధి వద్ద హిందూముస్లింల ప్రార్ధనలు, వేనాడు దర్గాను దర్శించుకున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త
తడ మండలం వేనాడు దీవిలో వెలసిన అల్లాతాత సమాధిని హిందూ ముస్లిం భాయ్ భాయ్ అంటూ మత సామరస్యానికి నిదర్శనంగా పలువురు దర్శించుకున్నారు. ఇక్కడ వేనాడు బాబాగా పిలుస్తున్న దర్గా వద్ద 29వ గంధోత్సవం ఘనంగా ముగిసింది. మంగళవారం అర్ధరాత్రి తర్వాత మొదలైన గంధం ఊరేగింపు బుధవారం ఉదయం సమాధిపై చల్లడంతో కార్యక్రమం ముగిసింది. గ్రామంలోని శ్రీరాములు మొదలి, సుదర్శన మొదలి ఇంటి నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. సాంప్రదాయ నృత్యాలు, ఖవ్వాలి పాటలు, మతపెద్దల ఆశీర్వాదాలతో అల్లాతాత గంధం ఊరేగింపు కొనసాగింది. ఉదయం 5.30 గంటలకు అక్కడ చద్దర్ కప్పి గంధం చల్లారు. గ్రామ యువకులు అందరికీ గంధం పంచారు. ఇదిలావుంటే రెండురోజుల పాటు జరిగిన ఈ గంధోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు దర్గాను దర్శించుకున్నారు. అల్లాతాతకు మొక్కుకున్నారు. పలువురు అధికారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రముఖులు కూడా హాజరయ్యారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడుల భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం రాత్రి ఒక గంటపాటు వర్షం కురవడంతో ఓపెన్ ప్లేస్ అయిన దర్గా ఆవరణలో ఉన్న భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. అయితే మంత్రం వేసినట్లుగా వానజల్లులు నిలిచిపోవడంతో భక్తులు మళ్లీ కోలాహలంగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సారి సుప్రసిద్ధ సినీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, ఆయన సోదరి వంటి వారు హాజరు కాలేదు. అయితే ఆనవాయితీగా రెహమాన్ కుటుంబ సభ్యులు కొందరు వచ్చి గంధోత్సవంలో పాల్గొన్నారు. తిరుపతి జిల్లా నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ కొండప్పనాయుడు బుధవారం ఉదయం దాకా వేనాడులోనే ఉండి శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

# కలెక్టర్.. స్కూల్ టీచర్ అయిన వేళ..



రేణిగుంట, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త
తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ స్కూల్ టీచర్‌గా మారి విద్యార్ధులకు విద్యా బోధన చేసిన సంఘటన బుధవారం రేణిగుంట బాలికల ప్లస్ టు ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియాలో భాగంగా రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ప్లస్‌టు ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పథకం అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న కార్యక్రమాన్ని మరింత మెరుగుపరచాలని, విద్యార్ధులను ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, శ్రీకాళహస్తి ఆర్డిఓ రవిశంకర్ రెడ్డి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ మోడల్ అధికారి శివశంకర్, డిప్యూటీ విద్యాశాఖ అధికారి బాలాజీ, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, సర్వ శిక్ష ప్లానింగ్ అధికారి రామచంద్రారెడ్డి, రేణిగుంట తహశీల్దార్ సురేష్ బాబు, ఎంపిడివో విష్ణు చిరంజీవి, ఎంఈఓలు గంటా ఇందిరా దేవి, రంగనాథ్, సర్పంచ్ నాగేషం తదితరులు ఉన్నారు

# ఏం మ్మా! డాక్టర్లు బాగా చూస్తున్నారా?

## డబ్బులేమైనా అడుగుతున్నారా?

## ఆసుపత్రిలో కలెక్టర్



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో బుధవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కలెక్టర్ పర్యటన వివరాలు ఆసుపత్రి వర్గాలకు ముందే తెలిసినప్పటికి మీడియాకు సమాచారం ఇవ్వకుండా రహస్యంగా ఉంచారు. ఆసుపత్రిలో సవాలక్ష సమస్యలు చోటు చేసుకున్నాయి.అంతేకాక కొత్తగా నిర్మించిన భవనాల పరిస్థితి నాణ్యత ఆగమ్యగోరచంగా మారింది. డయాల్సిస్ కేంద్రం పని తీరు, నెలలుగా పని చేయని జనరేటర్ ఇలా సమస్యల నిలయంగా మారింది.అంతేకాక ఇక్కడ సకాల సదుపాయాలున్నా రోగులను తిరుపతికి రెఫర్ చేస్తున్నారు.ఇలాంటి సమస్యలు కలెక్టర్ దృష్టికి మీడియా తెస్తుందని ఉన్నతాధికారుల పర్యటనలను మీడియా దృష్టికి రాకుండా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి ముందు జాగ్రత్తగా వ్యవహారిస్తున్నారు. అయితే కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ ఆసుపత్రిలోకి రాగానే ఇన్‌పేషెంట్లు ఉన్న వార్డులో వెళ్లి కొందరిని ప్రశ్నల వర్షం కురిపించారు.వైద్యసదుపాయాలేమిటి? సిబ్బంది పని తీరు ఏమిటి అని కొందరు యువకులను హెల్మెట్ ధరించకుంటే ప్రమాదమని చైతన్య పరచారు. ఇక ఆసుపత్రిల జనరేటర్ పని చేయటం లేదని రోగులు వివరించారు. వైద్యం, ఆహారం అన్ని బాగానే ఉన్నాయని రోగులు వివరించారు. ఆసుపత్రిలోని ఎక్స్‌రే గది, రక్త పరీక్షల గది, లేబోరేటరి, ఆపరేషన్ థియేటర్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందితో జరిపిన సమావేశంలో దిశ దెశ నిర్దేశం చేసారు.ఈ సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ మధు గైనాకాలజిస్టు డాక్టరు సుబ్బులక్ష్మి,డాక్టర్ స్రవంతి, ఆఫ్తామాలజిస్టు డాక్టర్ మణి,డెంటిస్టు డాక్టర్ ప్రతిభా చౌదరి,ముబీన్ తాజ్,డాక్టర్ సతీష్,డాక్టర్ మురళి,చక్రపాణి,పిజి డాక్టర్లు, నర్సింగ్ సూపరిటెండెంట్ విజయలక్ష్మి అమ్మాళ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రెయిన్ గన్లు పంపిణీ చేయాలి

## - జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు



వి.కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త
మెట్ట ప్రాంతాల్లో పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రెయిన్ గన్లు పంపిణీ చేయాలని జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పి.కొత్తూరులో ఆయన రైతులు సాగుచేసిన వేరుసెనగ పంట పరిశీలిచారు. ఖరీఫ్‌లో సరైన వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని పలుచోట్ల రైతులు ట్యాంకర్ల ద్వారా పంటలకు నీటిని అందిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి రైతులకు రెయిన్ గన్లు పంపిణీ చేయాలని కోరారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతు పూజలు జరిపించుకున్న కేంద్ర మంత్రి సురేష్‌గోపి

# కుటుంబ సభ్యులే కూలీలు

**-మస్టర్లలో చేతివాటం**
**-వేంబాకం ఫీల్డ్ అసిస్టెంట్ బాగోతం**
**-విచారణ మమ అనిపించారు**
**-ఉన్నతాధికారుల ఆదేశాలకు తూట్లు**

సత్యవేడు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:
ఉపాధి హామి పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఇచ్చిన ఫిర్యాదు..విచారణ కార్యక్రమాలు మమ అనిపించడంతో నాగలాపురం మండలం వేంబాకం పంచాయితీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కూడా అమలుచేయలేక పోయారని వారు మండిపడుతున్నారు. పంచాయితీ పరిధిలోని ఫీల్డ్‌అసిస్టెంట్ నారాయణ కొన్ని సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యులపేరుతో, ప్రయివేట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న వారి పేర్లుతో మస్టర్లు వేసుకుంటూ డబ్బులు దండుకుంటున్నారు. ఈవిషయమై తిరుపతిలో జరిగే గ్రీవెన్స్‌డేలో గ్రామస్తులు లిఖితపూర్వకముగా ఇచ్చిన ఫిర్యాదుతో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించవలసిందిగా మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం ఉపాధిహామి పథకం ఏపిడీ సరిత, ఏపిఓ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, సర్పంచ్ తేన్‌అరసు విచారణ చేపట్టారు. ఈవిచారణ తీరు పూర్తిగా విమర్శలకు దారితీసింది. ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ పంచాయితీ పరిధిలో లేని మునివేలు, నరేంద్ర, శివ పేర్లమీద మస్టర్లు వేసుకుంటూ లక్షలాది రూపాయల స్వాహాచేసినట్లు సమాఛారం.అలాగే వీరంతా కేవిబిపురం మండలం సరస్వతీకండ్రిగలో నేటికి నివాసం ఉన్నట్లు తెలిసింది. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ తమ కుటుంబ సభ్యుల పేర్లుతో మస్టర్లు వేసుకుని వారు పనిచేయకపోయినా చేసినట్లు నమోదు చేపట్టి అవినీతికి పాల్పడినట్లు స్పష్టంగా తెలుస్తున్నా



మండల అధికారులు సక్రమంగా విచారణ చేపట్టకుండా విచారణను తప్పుదోవ పట్టించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సరైన విధంగా విచారణ చేపట్టి ఉపాధిహామి పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## చిత్తశుద్ధితో అధికారులు విధులు

**- ఎమ్మెల్యే డాక్టర్ థామస్**



**పెనుమూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** అధికారులు ఆలసత్వం వీడనాడి చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి ప్రజలకు మంచి చేయాలని, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి హేమలతారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ ఇక్కడ కొంత మంది అధికారులకు గత ప్రభుత్వ వాసన పోలేదని, తమ ప్రజల పట్ల చులక భావంతో వ్యవహరిస్తున్నారన్నారు. ఇక్కడ పని చేస్తున్న సర్వేయర్‌పై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఇక్కడ పని చేయడం ఇష్టం లేకుంటే బదిలీపై వెళ్ళిపోవాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో రామకృష్ణాపురం సర్పంచ్ దూది వెంకటేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తాను సచివాలయ భవనం, రైతు భరోసా భవనాల పనులు చేపట్టానని అయితే ఇంకను బిల్లులు రాలేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. బిల్లులు మంజూరు అయ్యేల చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పెనుమూరు-నేంద్రగుంట రోడ్డు అధ్వన్యంగా తయారైందని రోడ్డు మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయాలని ఎంపిటిసీ సుభాషిణీ కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఓనీలకంఠేశ్వరరెడ్డి, జడ్పీటిసీదొరస్వామియాదవ్, ఎంపిటిసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## అకాడమీ విద్యార్థుల సాయం కలెక్టర్‌కు అందచేత

**పుంగనూరు, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :**



పట్టణంలోని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ ప్రోగుచేసిన విజయవాడ వరదబాధిత విరాళాన్ని పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి బుధవారం జిల్లాకలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందచేశారు. విజయవాడలో వరద కలిగించిన నష్టాన్ని తెలుసుకున్న విద్యార్థులు రూ.25 వేల రూపాయలను ప్రోగుచేశారని ఆయన కలెక్టర్‌కు వివరించారు. ఈనిధిని ముఖ్యమంత్రి సహాయనిధికి అందచేయాల్సిందిగా కలెక్టర్‌ను కోరారు. అకాడమీ విద్యార్థులు చూపించిన ఈచొరవ అభినందనీయమని, విద్యార్థులలో ఇలాంటి స్పందనకు కారణమైన అకాడమీ నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు.

## అర్హులందరికీ తప్పక సంక్షేమ పథకాలు అమలు

**కుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**



అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తప్పక లబ్ది కలిగిస్తామని కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధి అనిమిగానిపల్లి గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈసందర్బంగా గ్రామంలో ఈసందర్భ ంగా విద్యుత్ స్థ ంభాలు, రోడ్లు, డ్రైన్లు, పెన్షన్లు, హౌసింగ్‌కు సంబంధించి ప్రజలు వినతిపత్రాలు అందించారు. రేషన్‌కార్డులు, గృహ నిర్మాణాలకు అత్యధికంగా వినతులు వస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హులకు తప్పక ఇళ్లు, పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఆర్ముగ ం, మహిళా నేత భాగ్యలక్ష్మి త్రిలోక్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కుప్పం మండల తెదేపా తరపున 5.52లక్షల విరాళం



**కుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త** విజయవాడ వరద బాధితుల సహాయార్థం కుప్పం మండల తెలుగుదేశం పార్టీ తరపున రూ5,52,111ల విరాళాలను అందిస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వరద బాధితులను ఆదుకునేందుకు పార్టీ నేతలు ముందుకు వచ్చి ఇతోధిక సాయం అందించారు. మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ లక్ష రూపాయల చెక్కును ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంకు అందించారు. అలాగే ఎంపిపి అభ్యర్థి రాజగోపాల్ రూ 1,01111లు, మల్లానూరు పంచాయతీనుంచి 51వేలు, పైపాళ్యం నుంచి 50వేలు, ఇతర నేతలు కలిపి మొత్తం 5,52,111రూ.ల విరాళాలు ప్రకటించారు. కార్యక్రమంలో సలహాదారు నరేష్, చారి, రాష్ట్ర నేత శాంతారాం, నేతలు రవి, మహేంద్ర, రాజే ంద్ర, సంజీవి, మురళి, లీలా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు రాష్ట్ర నేత గోపీనాథ్ లక్ష రూపాయల విరాళం

**కుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త** విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, రాయచోటి నియోజకవర్గ పరిశీలకుడు పి. గోపీనాథ్ తనవంతు సాయంగా లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈమేరకు చెక్కును బుధవారం కుప్పం నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంకు అందించారు. దాతలు ముందుకు వచ్చి వరద బాధితులకు సాయం అందించాలని ఆయన

## వినాయకుని ఆలయంలో 350మందికి అన్నదానం

**కార్వేటినగరం, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:**



కార్వేటినగరంలో శివాలయంవీధిలో అద్వైత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 350మందికి అన్నదానం నిర్వహించారు. యువత 18అడుగుల వినాయకుని విగ్రహాన్ని లక్షా 80వేలకు తీసుకురావడం జరిగింది. వినాయకచవితి నుంచి 9రోజులు వరకు నిత్యం 300మందికి పైగా అన్నదానం నిర్వహిస్తామని కమిటీ తెలియజేశారు. నిత్య వినయకునికి ప్రత్యేక పూజలు జరుగుతుంది.

## నిమజ్జనానికి బయలుదేరిన గణనాథులు

**కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**

వినాయక చవితి పండగను పురస్కరించుకుని కోట మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు నిమజనానికి బుధవారం బలుదేరాయి. గత ఆరు రోజులగా నుంచి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గణనాధుల ముందు డప్పు వాయిద్యాలతో నాట్యం చేస్తూ భక్తులు గణనాధులను నిమజ్జనం చేసేందుకు బయలు దేరారు. మండల పరిధినిలోని శ్రీనివాస్‌సత్రం సముద్రం వద్ద నిమజ్జనం చేశారు. అక్కడ తహిశీల్దార్ కె. జయజయరావు ఇతర పోలీస్ అధికారులు పర్యవేక్షణలో నిమజ్జనం ప్రశాతంగా జరుగుతున్నాయి.

## వరద బాధితులకు రూ.25 వేలు సహాయం

**చిత్తూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**



విజయవాడ వరద బాధితులకు పుంగనూరు రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ స్కూల్ కరెస్పాండెంట్ సి.చంద్ర మోహన్‌రెడ్డి 25 వేల రూపాయల విరాళంను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు బుధవారం అదజేశారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం పుంగనూరు రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ స్కూల్ కరెస్పాండింగ్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి విజయవాడ వరద బాధితుల సహాయార్థం చెక్కును అందజేశారు.

## రేపు కార్వేటినగరంలో జాబ్ మేళా

**చిత్తూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, సీడప్, డిఆర్‌డిఎలు సంయుక్తంగా శుక్రవారం కార్వేటినగరం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాలో జాన్సన్ లిఫ్ట్స్ ప్రైవేటు లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీరామ్ చిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మెడ్‌పల్స్ ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కనీస విద్యార్హత టెన్త్, ఇంటర్మీడియేట్, ఐటిఐ, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయి 18-35 సంవత్సరాల మధ్య వున్న స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునన్నారు. నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 81425 090107, 79935 02145 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

## మాజీ జడ్పీటిసీ జన్మదినం పురస్కరించుకుని అన్నదానం

**గుడిపాల, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**



గుడిపాల మాజీ జడ్పీటిసీ బాలాజీనాయుడు జన్మదినంను పురస్కరించుకుని బుధవారం తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు అన్న క్యాంటీన్‌లో అన్నదానం చేశారు. మాజీ జడ్పీటిసీ బాలాజీ నాయుడు జన్మదినంను తెలుగుదేశం పార్టీ శ్రేణులు మండలంలో ఘనంగా నిర్వహించాయి. మండల పార్టీ కార్యాలయంలో బాలాజీ నాయుడు జన్మదినంను పురస్కరించుకుని కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటిసీ బాలాజీ నాయుడును తెలుగుదేశం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు సుబ్రమణ్యంనాయుడు, అనిల్‌కుమార్, నాగరాజు యాదవ్, చిట్టి, గోవిందగౌడ్, ప్రతాప్, కిట్టు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా కార్యకర్తలపై దాడి

**సదుం, సెప్టెంబరు 11 ప్రభాతవార్త**

మండల పరిదిలో వైకాపా కార్యకర్తలపై పలువురు దాడి చేసి గాయపరచినట్లు జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి తెలిపారు. బుదవారం సదుం బస్టాండులో వైకాపా ఆధ్వర్యంలో ఎంపీ మిదున్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో పాలమంద పంచాయతీ పెద్దూరుకు చెందిన పలువురు వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారని. అది మనపులో పెట్టుకుని సదుం నుంచి పెద్దూరుకు వెళ్లిన వైకాపా కార్యకర్తలు మునీంద్ర, ఖాదర్‌భాషా, శివాజీ, రామకృష్ణ, మల్లికార్జునలపై తెదేపా కార్యకర్తలు కత్తులుతో దాడి చేసి గాయ పరిచారని చెప్పారు. వీరిని సదుం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గణపతికి ఘనంగా నిమజ్జనం

**చౌడేపల్లి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**



మండలంలోని పలుచోట్ల బుధవారం వినాయకస్వామి విగ్రహాలకు ఘనంగా నిమజ్జనం నిర్వహించారు. పట్టణంలోని నాయనివారిపాళెం, టీచర్స్‌కాలనీ తోపాటు పలు ప్రాంతాల్లో 5రోజులపాటు పూజలందుకొన్న బొజ్జగణపయ్యలను యువకులు బాణా సంచాలు, బళ్ళారి డ్రమ్ములు, సాంస్కృతి నడుమ ఊరేగిస్తూ సమీప చెరువులు, కుంటలందు జలదిలో కలిపారు.

## షర్మిల రెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



**వెదురుకుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ పుష్ప గుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ నియామక పత్రాన్ని ఆమె చేతుల మీదుగా అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతంకు గట్టిగా కృషి చేస్తూ 2029 ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చేందుకు క్షేత్ర స్ధాయిలో పనిచేస్తామన్నారు. ఇప్పటి నుంచి పార్టీ ప్రక్షాళన చేస్తూ సంస్థాగతంగా బలపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు భాస్కర్ తెలిపారు.

## ప్రవీణ్‌కుమార్‌కు సహృదయసేవాసమితి ఆర్థికసాయం

**కార్వేటినగరం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**

కార్వేటినగరం తూర్పువీధిలో కాపురమున్న ప్రవీణ్‌కుమార్‌కు సహృద యసేవాసమితి ఆర్థికసాయం అందించినట్లు సేవాసమితి అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌కు ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో కోమాలోకి వెళ్ళారని వైద్య ఖర్చులకు 15లక్షలకు పైగా ఖర్చువుతుందని దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వారి కుటుంబసభ్యులు కోరగా కార్వేటినగరానికి చెందిన సహృదయసేవాసమితి 27వేలు రూపాయిలు ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు.

## నేడు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ

**శాంతిపురం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పిడి వికాస్ మర్మత్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో ఇటీవల కంటి పరీక్షలు జరుపుకున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వరద బాధితులకు శాంతిపురంలో 2.40లక్షల విరాళాలు

**శాంతిపురం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మండల టిడిపి నేతలు ముందుకు వస్తున్నారు. గుంజార్లపల్లి సర్పంచ్ విజయరామిరెడ్డి (జని) రెండు లక్షల విరాళాన్ని అందించారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పదిహేనువేలు, నందిగం ఉదయ్ 25వేలు, నోబుల్ స్కూల్ 50వేలు అందించారు. తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, ఉఆదయ్, మణి, ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం

**రామకుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని రామ్ నగర్, శివాజీ నగర్ కాలనీల్లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను బుధవారం ఘనంగా నిమజ్జనం చేశారు. పుర వీధుల్లో బాణ సంచా కాల్పుల మధ్య డప్పు వాద్యాల నడమ ఘనంగా ఊరేగిస్తూ నిమజ్జనంకు తరలించారు. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం జరిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ మల్లేష్ యాదవ్ బందోబస్తు చేపట్టారు.

## ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ రామకృష్ణ కుటుంబానికి 41వేల సాయం

**కుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**

ద్రవిడ విశ్వవిద్యాలయంలో గార్డెనర్‌గా పనిచేస్తూ ఇటీవల అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రామకృష్ణ కుటుంబానికి వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులు చందాలు వేసుకుని బుధవారం 41వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. త్వరలోనే వేతనాలు మంజూరవుతాయని అధైర్యపడవద్దని రామకృష్ణ కుటుంబానికి ధైర్యం చెప్పారు. తాత్కాలిక ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా సాటి ఉద్యోగులు ఏకత్రాటిపై నడిచి సాయం అందిస్తామని పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు

**తడ, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**



సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తడ మండలం చేనిగుంట, గ్రద్దగుంట గ్రామాల్లో ఎలిది పైరు వేసే రైతులకు రెండురోజుల పాటు అధికారులు పలు సూచనలిచ్చారు. నేరుగా పంట పొలాల వద్దకు వెళ్లి వరి విత్తనాలను వెదజల్లడం గురించి, ఎకరాకు ఎంత మోతాదు విత్తనాలు చల్లాలన్న దానిపై సూచనలు చేశారు. ఎకరాకు 20 కిలోలు చొప్పున ఇప్పటికే మండల పరిధిలో 150 ఎకరాల దాకా ఎలిది పైరు వేశారని, ఇక్కడ కలుపు సమస్య తీవ్రంగా ఉందని వ్యవసాయ శాఖ ఏడీ అనిత తెలిపారు. విత్తనాలు చల్లిన రెండురోజుల్లో పైరజొ సల్ఫిలాన్ ఎథైల్ మందు చల్లుకోవాలని ఆమె సూచించారు. మండల వ్యవసాయశాఖ అధికారి కాంచన, పలువురు విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

## బలిజ సంక్షేమ సంఘం నాయకులచే ఎమ్మెల్యేకు సత్కారం

**వెంకటగిరి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త**



నూతనంగా ఎన్నికైన కాపు, బలిజ సంక్షేమ సంఘం వారు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను కలిసి సత్కరించారు. ఎమ్మెల్యేకి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కారం చేశారు. కాపు సంక్షేమ భవనానికి స్థలం కేటాయించాలని అధ్యక్షుడు టిటీ మణి ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. కాపు బలిజల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు గుండు మనోజ్ కుమార్, రాము డాక్టర్ గోపాల్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## మహాజన సభ కార్యక్రమం

**చిల్లకూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త**



చిల్లకూరు మండలంలోని తిప్పగుంటపాలెంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణంలో బుధవారం మహాజన సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డివిజనల్ సహకార శాఖ అధికారి రవి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేస్తున్నారని, ఇందులో భాగంగా సంఘ సభ్యులు కేవైసీ డిటైల్స్‌ను సొసైటీ అందించాలని, ఈ సంఘంలో సుమారు 1000 మంది వరకు సభ్యులు ఉన్నారని, అందులో 600 మంది మాత్రమే వారి డిటెయిల్స్ ఇవ్వడం జరిగిందని, మిగతా వారు కూడా అందజేయాలని, ఈ కంప్యూటరీకరణ కోసం మన రాష్ట్రానికి నాబార్డ్ నిధుల నుండి రెండు వేల కోట్లు ఇవ్వడం జరిగిందని, ఇక నుండి ఆన్‌లైన్ విధానంలోనే సహకార సంఘ కార్యకాలాపాలు జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిప్పగుంటపాలెం సొసైటీ సిఈవో రాజనేని రామానాయుడు, అసిస్టెంట్ రిజిస్టర్ విద్యా సాగర్, ఇంచార్జి ఇలియాజ్, సంఘం మాజీ అధ్యక్షులు ఎల్లంటి ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు నాయుడు, నాయకులు, పగడాల శ్రీనివాసులు రెడ్డి, రఘురాం రెడ్డి, సంఘ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రవేట్ సిలికా మైన్స్ డీలర్లకి అనుమతులు ఇప్పించండి

**మంత్రికి ఎమ్మెల్యే వినతి పత్రం**

**చిల్లకూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త**



చిల్లకూరు మండలంలో తీర ప్రాంత గ్రామాల్లో సిల్కా సంపద క్రయ విక్రయాలు చేసుకునేందుకు అనుమతులు కావాలని అదే విధంగా నియోజకవర్గంలో ఉన్న అన్ని మైన్సులుకి అనుమతులు కావాలని మండలంలోని తిక్కవరం గ్రామ సర్పంచ్ ఓడూరు సత్యనారాయణ రెడ్డి మరో సిలికా మైన్ యజమాని యశ్వంత్‌లతో కలిసి గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ విజయవాడ రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రని కలిసి నియోజకవర్గంలో నిలుపుదల చేసి ఉన్ మైనింగ్ డీలర్ల లైసెన్సులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిను కలిసి వినతిపత్రం అందించిన వెంటనే స్పందించిన మంత్రి తొందరలో ఈ విషయాలను లోకేష్ బాబు తీసుకొని పోయి స్వయంగా వచ్చి పరిశీలించి త్వరలో మైనింగ్ డీలర్లు చేసుకునే విధంగా ఏర్పాటు చేస్తామని మంత్రి ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కి హామీ ఇచ్చారు.

## ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో వివేకానంద సెమినార్‌లో

**ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణీ సభ్యులు యుగంధర్**

**గూడూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త**



గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద సెమినార్ నిర్వహించడం జరిగింది. స్వామి వివేకానంద 1893వ సంవత్సరంలో చికాగోలో జరిగిన విశ్వమత మహాసభలలో ఉపన్యసించిన సందర్భంగా ఈ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారణి సభ్యులు యుగంధర్ మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశపు ఖ్యాతిని చాటి చెప్పిన రోజు సెప్టెంబర్ 11 అని, ప్రపంచానికి నాగరికతను నేర్పింది ఈ రోజేనని, వివేకానందుల వారు ప్రసంగించిన ఈ రోజును జరుపుకోవడం చాలా ఆనందదాయకం అన్నారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన 100 మంది యువతనిస్తే ఈ దేశాన్ని మారుస్తానన్న వివేకానందుని బోధనలు నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్ఎస్ఎస్ జిల్లా కళాశాల విద్యార్థి మన్నూరు మల్లికార్జున మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది అన్నారు. నేటి తరం యువత వివేకానంద, భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, ఝాన్సీ లక్ష్మీ సాయి, వీర సావర్కర్ వంటి వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం వివేకానందునికి పుష్పాంజలి ఘటించారు. భరతమాతను విశ్వ గురువు చేసే ప్రయత్నంలో మనమందనం సమిధలు కావాలని ఆకాంక్షించారు, కళాశాల హెచ్ఓడిలు మూర్తి, మహేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

## గూడూరు డిఎస్పీ ఆశ్రయించిన ప్రేమ జంట

**గూడూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త**



తమకు పెద్దల నుండి రక్షణ కల్పించాలంటూ వేడుకున్న ప్రేమ జంట గూడూరు డిఎస్పిని ఆశ్రయించారు. కులాంతర వివాహం కావడంతో డిఎస్పిని ఆశ్రయించి తమ ఇరు కుటుంబాల నుండి ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తమను కాపాడాలంటూ డిఎస్పిని ప్రేమ జంట వేడుకున్నారు. గూడూరు పట్టణానికి చెందిన సాయి కుమార్ (23) కర్ణాటక బళ్లారికి చెందిన దివ్య (22), గత మూడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నామని తమ పెళ్ళికి పెద్దలు నిరాకరించడంతో తామే వివాహం చేసుకున్నామని డిఎస్పికి విన్నవించుకున్నారు.

## సమన్వయంతో పనిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి

**కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**



అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ప్రమాదాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందని కోట తహశీల్దార్ కె.జయజయరావు అన్నారు. బుధవారం కోట మండలం శ్రీనివాసత్రం వద్ద సముద్ర తీరంలో వినాయక నిమజ్జనాల సందర్భంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. సముద్రంలోకి ఎవరంటే వారు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది జాగ్రత్తగా పర్యవేక్షించాలని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదే అని చెప్పారు. గత వారంరోజుల నుంచి గణేష్, విగ్రహాలు సముద్ర తీరంలోకి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్నాయని తెలిపారు. భక్తుల తాకిడితో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో కోట విద్యార్థుల ప్రతిభ

**కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**



నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 9వ తేదీన జరిగిన జూనియర్ జిల్లా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కోటలోని ఎన్‌సిఆర్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. అండర్-14 బాలికల విభాగంలో లాంగ్ జంప్‌లో సిహెచ్ రోహిత ప్రథమ స్థానం, అండర్-14 బాలుర విభాగంలో లాంగ్ జంప్‌లో సిహెచ్ విష్ణువర్ధన్ ద్వితీయ స్థానం, అండర్-16 బాలికల విభాగంలో సిహెచ్ గీతిక లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, జావిలిన్ ప్రథమ స్థానం, సిహెచ్ చెంచు వందన లాంచ్ జంప్ తృతీయ స్థానం, జావిలిన్ ద్వితీయ స్థానం సాధించారు. విజయం సాధించిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణను ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

## బోడిలింగాలపాడు వద్ద రెండు మోటారు సైకిళ్ల ఢీ

**- యువకుడు మృతి**

**తడ, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**



తడ మండలం బోడిలింగాలపాడు వద్ద బుధవారం సాయంత్రం రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. తడకు చెందిన పవన్ కల్యాణ్ అలియాస్ విష్ణు తన బంధువుల ఇంటికి వెళుతూ బోడిలింగాలపాడు మలుపు వద్ద జాతీయ రహదారి దాటుతుండగా సూళ్లూరుపేట నుంచి తడ వైపు వేగంగా వస్తున్న మోటారుసైకిల్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన పవన్ కల్యాణ్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం తరలించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ప్రమాదానికి కారణమైన మోటారుసైక్లిస్టు కూడా గాయపడ్డాడు. తడ ఎస్ఐ కొండప్పనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని యువకుని మృతదేహం కలకలం

**గూడూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త**



గూడూరు రూరల్ పరిధిలోని చల్లకాలువ బ్రిడ్జి సమీపంలోని పొలాలులో గుర్తు తెలియని యువకుడు మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు గూడూరు రూరల్ సిఐ కిషోర్ బాబు, ఎస్ఐ మనోజ్ కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు మృతుడు వయసు సుమారు 25 సంవత్సరాలు ఉన్నాయనీ, మృతదేహం పై అక్కడక్కడ గాయాలు, తలకు గాయమై ఉందన్నారు. మృతుడు బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, చెక్స్ షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## పేద విద్యార్థినికి ఎమ్మెల్యే చేయూత

**గూడూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త**



గూడూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన మల్లి శ్రావణికి ఎంసిఏ మొదటి సంవత్సరం ఫీజు 25 వేలు రూపాయిలను గూడూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ దాతృత్వంతో తెలుగు మహిళ నాయకురాలు మట్టం శ్రావణి రెడ్డి వారికి అందించారు. మట్టం శ్రావణి మాట్లాడుతూ తండ్రిని కోల్పోయి చదువుకునే స్తోమతలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మల్లి శ్రావణి కుటుంబానికి అండగా పాశిం సునీల్ కుమార్ నిలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని మల్లి శ్రావణి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కి ధన్యవాదాలు తెలియచేశారు.

## ఘనంగా పోషకాహార మాసోత్సవాలు

**చిల్లకూరు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త**



చిల్లకూరు మండలంలోని వరగలి గ్రామంలో పోషకాహార మాసోత్సవాలుతో భాగంగా వరగలిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసిడిపిఓ జ్యోతి కిరణ్ పోషకాహారం గురించి తల్లులకు గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించి అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పి. శివజ్యోతి, అంగన్‌వాడి కార్యకర్తలు ప్రమీల, శైలజ, రాజేశ్వరి, మైదిలి పాల్గొన్నారు.

## మహిళలు క్యాన్సర్ స్క్రీనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి ...ఎమ్మెల్యే

**దొరవారిసత్రం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త;**

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూళ్ళూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మండలంలోని తనయాలి గ్రామసచివాలయం పరిధిలో నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో 35సంవత్సరాలు వయస్సు కలిగినవారు తప్పని సరిగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వార మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతుందన్నారు. ఇందులో పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము, గర్భశయ, ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, పద్మజ, సర్పంచులు సుబ్బమ్మ, చెంగయ్య, నాగేంద్ర, వీరరాఘవులు. వైద్యసిబ్బంది, మహిళలు ఉన్నారు.

## ధార్మికతతో శాంతి సౌఖ్యం: బృందమ్మ

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



సమాజంలో ధార్మికతతో శాంతి సౌఖ్యం ఏర్పడుతుందని, ఆధ్యాత్మిక చింతనను ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవాలని బొజ్జల బృందమ్మ పిలుపు నిచ్చారు. పట్టణ నడిబొడ్డులోని సుబ్రమణ్యం స్వామి కొండ దిగువన వెలసిన వినాయక ఆలయం వద్ద తెలుగుదేశం పార్టీకి చెందిన వంకాయల సిద్దులయ్య ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలకు ఆమె ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. బుధవారం వినాయక చవితి 5రోజుల సందర్భంగా పట్టణంలోని వాడవాడల్లో సామాజిక కార్యక్రమాలను తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు ఏర్పాటు చేసారు. లోక కళ్యాణార్థం, సామాజిక సంక్షేమాన్ని కాంక్షించి ఇక్కడ సిద్దులయ్య, హరిల సారధ్యంలో భారీ ఎత్తున వినాయక స్వామి హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బృందమ్మతో పాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్, శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహామూర్తి, తిరుపతి పార్లమెంట్ తెలుగుదేశం కోశాధికారి కంఠా రమేష్, మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గురప్పశెట్టి, మాజీ టౌన్‌బ్యాంకు చైర్మెన్ డివి నారాయణ, అనిల్ వినాయక చవితి కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ధ్యాన యోగం ఆరోగ్యకర జీవనాన్ని అందిస్తుంది

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



'ధ్యాన యోగం మనిషికి ఆరోగ్యకరమైన జీవనాన్ని అందిస్తుందని మాతా శ్రేయానంద స్వామిని, స్వాతానంద స్వామి అన్నారు. ఇక్కఇ ముత్యాలమ్మగుడి వీధిలోని కళ్యాణ మండపంలో శుక బ్రహ్మాశ్రమం, శ్రీకాళహస్తీశ్వరాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న భగవద్గీత ఆరవ అధ్యాయం, ధ్యాన యోగంపై భక్తులకు దిశ దేశ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆరవ సప్తావహం సందర్భంగా ఆశ్రమ వాసులు మాట్లాడుతూ నేడు సమూజంలో మానవుడు శాంతి కోసం పరుగులు తీస్తున్నాడు. ఎవరు అయితే శాంతిని ప్రసాదిస్తారో వారి ఆరాధనను తుంగలో తొక్కి జీవిత రహస్యం తెలుసుకోకుండా పరుగులు తీస్తూ తను ఎంత సంపాదించిన ఒదుగు లేదని వాపోతున్నాడన్నారు. సమాజంలో రుగ్మతలు, ఈర్ష్యా ,ద్వేషాలు రాజ్యమేలుతున్నాయి. ఈ తరుణంలో మానవుని జీవితం సాఫీగా సాగాలన్నా శాంతి ఽసౌఖ్యాలు పొందాలన్నా గీతలోని ఆరవ అధ్యాయం అయిన 'ధ్యాన యోగ సాధనే' సరైన మార్గమన్నారు. అ ర్జునునికి గీతోపదేశం చేసిన కృష్ణుడు ధ్యాన మార్గాన్ని ఉపదేశించాడన్నారు.

## ఏపీ ఆర్ సెట్ అడ్మిషన్ల కన్వీనర్‌గా ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:



ఏపీ ఆర్ సెట్ 2023-24 అడ్మిషన్ల కన్వీనర్‌గా ఎస్వీయూ ఓఆర్ఐ విభాగ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వారిని కన్వీనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఏపీ ఆర్ సెట్ ప్రవేశ పరీక్షలు పూర్తి అయి, ర్యాంకులు ప్రకటించారు. ఈ క్రమంలో అడ్మిషన్లు నిర్వహించవలసి ఉంది. గతంలోనూ ఏపీ ఆర్ సెట్ -2021 కో-కన్వీనర్ గా ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు వ్యవహరించిన అనుభవం వుంది. ఈ నేపథ్యంలో బుధవారం అమరావతిలో ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ నెల 15వ తేదీ నుంచి తొలిదశ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించే విధంగా నిర్ణయం తీసుకున్నారని, ఈ నెలఖరులోగా తొలిదశ అడ్మిషన్లు పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్టు ఏపీ ఆర్ సెట్ అడ్మిషన్ల కన్వీనర్ తెలిపారు.

## బ్రహ్మోత్సవాలకు తిరుపతికి 150 బస్సులు

-అంతర్‌రాష్ట్ర ఆర్టీసి అధికారులతో ఆర్ఎం సమావేశం

తిరుపతి, సెప్టెంబర్ 11ప్రభాతవార్త:



ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి అక్టోబర్ 4నుండి 12వతేదీ వరకు జరగనున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తమిళనాడు, కర్నాటక ప్రాంతాలనుండి సులభంగా భక్తులు చేరుకునేలా ఆయారాష్ట్రాల ఆర్టీసి 150 బస్సులు అదనంగానడపాలని తిరుపతి ప్రాంతీయ ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి కోరారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, తమిళనాడు, కర్నాటక, ఆంధ్ర ఆర్టీసి బస్సులు 150 ప్రత్యేక బస్సులను తిరుపతి-చెన్నై, తిరుపతి-కంచి, తిరుపతి-వేలూరు. తిరుపతి-తిరువణ్ణామలై, తిరుపతి హోసూరు ,కృష్ణగిరి, కుప్పం, కళ్ళకురిచి, విల్లుపురం, పాండిచ్చేరి, సేలం, కోయంబత్తూరు. కుంభకోణం, తంజావూరు, నాగపట్టణం, హోసూరు, ధర్మపురిలకు నడపాలని కోరారు. డిపిటిఓ చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సిటిఎం ఎం.భాస్కర్, తిరుపతి డిఎం టి.బాలాజీ, మంగళం డిఎం భాస్కర్, అలిపిరి డిఎం హరిబాబు, సిబిఎస్ ఎటిఎండిఆర్ నాయుడు, తమిళనాడు చెన్నై, ధర్మపురి, వేలూరు, కాంచీపురం టిఎన్ఎస్‌టిసి అధికారులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి శ్రేణులను సిద్ధంచేయండి

-తిరుపతి జిల్లా నేతలకు పిసిసి చీఫ్ షర్మిల నిర్దేశం

తిరుపతి, సెప్టెంబర్ 11ప్రభాతవార్త:



రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేసి, పూర్వవైభవం తీసుకురావడానికి పార్టీ శ్రేణులు సిద్దంకావాలని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి నిర్దేశం చేశారు. తిరుపతి జిల్లాలో కాంగ్రెస్‌ను పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయిలో పటిష్టంచేయాలని, ఇందుకు ప్రజలతో కలసి పనిచేయాలని ఆమె సూచించారు. తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బాలగురవంబాబు, నగర పార్టీ అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు, పిసిసి ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తమటం వెంకటనరసింహులు మర్యాదపూర్వకంగా బుధవారం విజయవాడలో షర్మిలను కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో కాంగ్రెస్ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తాచాటాలని నాయకులకు సూచించారు. అనంతరంఅందరూకలసిషర్మిలను దుశ్శాలువతో సత్కరించి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు.

## ఉచితంగా పార్టీ సభ్యత్వనమోదు తీసుకోండి

-బిజెపి నేతల పిలుపు

తిరుపతి, సెప్టెంబర్ 11ప్రభాతవార్త:



గత పదిసంవత్సరాలుగా దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా నడిపిస్తున్న, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బిజెపిని బలపరచాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ప్రతి ఒక్కరూ ఉచిత సభ్యత్వ నమోదు తీసుకుని బిజెపిని బలపరచాలని పిలుపు నిచ్చారు. బిజెపి సభ్యత్వనమోదు శిబిరం బుధవారం గంగమ్మగుడి శక్తికేంద్రం ఇన్‌ఛార్జి గుండాల గోపీనా దరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, కట్టమంచి చంద్రబాబు, సుబ్రమ ణ్యంరెడ్డి, కస్పాపద్మనాభం, కల్యాణి, చంద్ర రాయల్ పాల్గొని బిజెపిసభ్యత్వ నమోదుపై82,83 84,85, 86బూత్‌లపరిధిలో అవగాహనకల్పించారు.

## వినాయక లడ్డును ఊరేగింపుగా తీసుకువెళ్లి ...

వేలం వేసిన ఊటగుంట వినాయక ట్రస్ట్ పవర్ యూత్

**తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త** తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని 29వ డివిజన్ కార్పొరేటర్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఘనంగా జరిగిన వినాయక చవితి ఐదవ రోజు నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పాల్గొని వినాయక లడ్డును నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి వినాయక స్వామి పూజలు నిర్వహించి అనంతరం లడ్డు వేలం వెయ్యడం జరిగింది. ఊటగుంట వినాయక ట్రస్ట్ పవర్ యూత్ లడ్డు వేలం పాటలో దక్కించుకున్నారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఊటగుంట వాస్తవ్యులు ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించడం విశేషం అని తెలిపారు. 29వ డివిజన్ కార్పొరేషన్ ఆదిలక్ష్మి వారి కుటుంబ సభ్యులు మేయర్ శిరీషను ఘనంగా ఆహ్వానించి సన్మానించారు. అనంతరం గణపయ్యకు పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లోనగరమేయర్ డాక్టర్ శిరీషతో పాటు కార్పొరేటర్లు కల్పన, శైలజ, రేవతి తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా నాగ హారతి ఊరేగింపు

**రేణిగుంట, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త** శ్రీశ్రీశ్రీ కట్ట పుట్టాలమ్మ జాతరలో భాగంగా బుధవారం రేణిగుంట మండలం దొడ్ల మిట్ట నందు నాగ హారతి ఊరేగింపు సేవ వంశ పార్యంపర్య ధర్మకర్త కురకాలవ రామచంద్రయ్య, వాసు ఇంటి వద్ద జరిగింది. వాసు ఇంటి నుండి నాగ హారతి ఊరేగింపు మేళ తాళాలు, భాజా భజంత్రీలు, కోలాటాలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ కట్ట పుట్టాలమ్మ దేవస్థానం వద్ద బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌తో పాటు బిజెపి యువనేత రాజా రాయల్ అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. టిడిపి సీనియన్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు నాగ హారతిని దిర్శంచుకున్నారు.

## చేతివృత్తుల వల్ల మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చు

**రేణిగుంట, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త** మహిళలు చేతివృత్తులు నేర్చుకుంటే ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చు అని రాస్ పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు అన్నారు. రేణిగుంట మండలం, కరకంబాడి, ఇందిరానగర్, రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ కార్యాలయం నందు రాస్ జన శిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ రెండు బ్యాచ్‌లను బుధవారం రాష్ట్రీయ సేవా సమితి పొదుపు సంఘాల సంచాలకులు వి. నాగరాజు, కెనరా బ్యాంక్ కరకంబాడి శాఖ మేనేజర్ సిద్ధు, జన శిక్షణా సంస్థాన్ డైరెక్టర్ మోహన్ ప్రారంభించారు. గతంలో టైలరింగ్ ఆర్య వర్క్ నేర్చుకున్న వారికి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ద్వారా ధ్రువీకరణ పత్రాలు, మెటీరియల్ అందజేశారు. జన శిక్షణా సంస్థాన్ కోఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి, ట్రస్టీలు రమేష్ రెడ్డి, సుబ్బరత్నమ్మ నిత్య సుధా, ట్రస్ట్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ గిరి ప్రసాద్, అన్బలగన్, ఇందుమతి, నాగమణి స్వాతి, శంకరయ్య, క్లస్టర్ లీడర్లు 120 మంది మహిళలు పాల్గొన్నారు.

## హరిబాబుకు దళితవీర్ అవార్డు ప్రదానం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



పట్టణానికి చెందినదళిత బహుజన ఫ్రంట్ రాయలసీమ కో ఆర్డినేటర్ నత్తంహరిబాబు ప్రతిష్టాత్మక దళిత వీర్ అవార్డును అందుకున్నారు. గుంటూరులోని అరండల్ పేట ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన దళిత పల్లెవీరుల మహోత్సవాన్ని పురస్కరించుకుని హరిబాబుకు అవార్డును అందించారు. చుండూరు దళివతపోరులో అమరుడైన కొమ్మర్ల అనిల్‌కుమార్ స్ఫూర్తితో దళిత, మానవహక్కుల పరిరక్షణకు అంకితభావంతో విశేష కృషి చేస్తున్న దళితులకు ఈ అవార్డును ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా అందిస్తున్నారు. ఈకోవలో తన వంతు కృషిచేస్తున్న దళితులకు ఈ దళితవీర్ అవార్డును అందించనున్నారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు నత్తంహరిబాబురే దక్కించుకున్నారు. అవార్డును దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ చేతులమీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో డిబిఎస్ జాతీయ కార్యదర్శి మేళం భాగ్యరావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు భూపతి, సునీల్‌కుమార్, వివిధ సంఘాలకు చెందిన పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## పెట్టుబడి సాయమేది సిఎం గారు....

రైతు సంఘం

.శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడచిపోయిందని మరి రైతాంగానికి ఇస్తానన్న రూ.20వేలు పెట్టుబడి సాయమేదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును సైతం రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత ప్రశ్నించారు. రైతాంగం సమస్యలు గత ఎన్నికల హామీల అమలుపై స్థానిక ఎస్‌డికె నగర్ సచివాలయ వద్ద రైతు సంఘం నాయకులు బుధవారం నిరసన తెలిపారు. అనంతరం హేమలత మాట్లాడుతూ గత ఎన్నికల్లో రైతులు, కౌలురైతుల మద్దతుతో ఎన్డీఏ కూటమి భారీ మెజార్టీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని గుర్తుచేవారు. అయితే రైతులకు అండగా ఇస్తానన్న పెట్టుబడి సాయాన్ని ఇంతవరకు విడుదల చేయలేదని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవ పథకం కార్యాచరణ కూడా ఇప్పటి వరకు ప్రకటించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు పెట్టుబడి సాయాన్ని విడుదల చేసి ఉంటే రైతులు, కౌలు రైతులు పెట్టుబడి కోసం బ్యాంకుల చుట్టు తిరగాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. అంతేకాకుండా 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లో కరువు తుఫాన్‌లతో నష్టపోయిన పంటలకు బీమా పరిహారం ఇవ్వాలని సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.2లక్షల వరకు రైతుల రుణాలు రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లుకు మీటర్లు పెట్టే జివో 22ను రద్దు చేయాలని కోరారు. కెవిబిపురం మండలంలో ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు సాగునీరు అందించాలని తలకోన నీటిని వృధా కాకుండా సమీప చెరువులకు మళ్ళించి రైతులకు సాగునీరు అందించాలన్నారు. పాడి రైతులకు శ్రేయస్కరంగా ఉండే గొర్రెలు, మేకలు, పశువుల షెడ్లను పార్టీలకు అతీతంగా నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ధాన్యం ఆరబెట్టుకోవడానికి ప్రతి పంచాయతీలో కల్లాలు, నిల్వచేసుకోవడానికి గోదాములు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సచివాలయ అధికారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గంధమణి, పెనగడం గురవయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుణాత్మక విద్యను ప్రతి ఒక్కరికి అందించాలి

-డిసిఓ పద్మజ

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడంతో పాటు లక్ష్యం చేరేలా గుణాత్మక విద్యను అందించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయాధికారి టి.పద్మజ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఆమె స్థానిక కాసాగార్డెన్ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వంటశాలను, తరగతి గదులను, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి సామర్థ్యాలను వెలికి తీసే ప్రయత్నం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ముఖ్యంగా 9,10 ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో పాటు కమ్యూనికేషన్లు స్కిల్ డెవలప్‌మెంట్ పెంపొందించేలా చొరవచూపాలని సూచించారు.

## కేంద్రమంత్రిని కలసిన దశరధాచారి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



కేంద్ర పెట్రోలియం, కెమికల్స్ సహజవాయువుశాఖ పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్‌గోపిని రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గుమ్మడిపూడి దశరధాచారి బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసిన సందర్భంగా ఆయన్న మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సురేష్‌గోపిని కలసి తిరుపతి జిల్లాకు హస్తకళలు మరియు చేనేత ఖాదీ గ్రామీణ పరిశ్రమల కారిడార్‌గా గుర్తించి హెరిటేజ్ క్లస్టర్‌ను మంజూరు చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో కిషోర్, సునీల్, బాబు, గజేంద్రనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గర్భిణీస్త్రీలు నాణ్యమైన పోషకాహారాన్ని తీసుకోవాలి

తొట్టంబేడు, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



నేటి ఆధునిక జీవన విధానంలో గర్భిణీస్త్రీలు నాణ్యమైన పోషకాహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ శాంతిదుర్గ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెన్నలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ ప్రతి ఏడాది సెప్టెంబర్ నెల 1 నుంచి 30 వరకు పోషణ్‌అభియాన్ పేరిట మాసోత్సవాలును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ స్వచ్ఛంద సంస్థలు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు వివిధశాఖల భాగస్వామ్యంతో ఈనెల 30వరకు పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు గర్భిణీస్త్రీలకు మరియు బాలింతలకు పౌష్టికాహారం అందుతోందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోలూరుశోభ, శంకరమ్మ, పార్వతీ, దేవీలత, దివ్య, విజయ, రత్నమ్మ, శైలాకుమారి, వెంకలక్ష్మి, నాగమణి, నిర్మల, సుజాత పాల్గొన్నారు. కాగా చిలకావారి కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరిపాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమమే లక్ష్యం..అంజూరు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఏపిఎస్ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశాలో గౌరవాధ్యక్షులు అంజూరుతారకశ్రీనివాసులు తెలిపారు. బుధవారం శ్రీకాళహస్తి డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో డిపో అధ్యక్షులు పురుషోత్తం ఆచారి అధ్యతన నిర్వహించారు. ఈసర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన గౌరవాధ్యక్షుడు అంజూరుతారక శ్రీనివాసులు మాట్లాడుతూ వివిధ యూనియన్‌ల నుంచి సుమారు 20మంది ఎంప్లాయిస్ యూనియన్ కుటుంబంలోకి వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఎప్పుడు కూడా కార్మిక సంస్థ నిలబడాలంటే ఎంతో కష్టదాయకంగా ఉంటుందని తెలిపారు. ఒక కార్మిక సంఘం సుమారు 75ఏళ్ళుగా కొనసాగుతోందని అంటే ఆ యొక్క కార్మికుల నిబద్ధత ఆ కార్మికుల నిజాయితీ ఆ కార్మికులు ఉండేది నిస్వార్ధంగా ఉంటారన్నారు. అనంతరంఅంజూరుతారకశ్రీనివాసులను సత్కరించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి శ్రీనివాస్‌కుమార్, సూరిబాబు, సిపిరావు, నరసింహులు, కెసిరెడ్డి, ఎస్ఎంరత్నం, కుప్పయ్య, సూరిబాబు, నరసింపలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రికి ఘనస్వాగతం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



కేంద్ర పర్యాటక శాఖ మంత్రి సినినటులు సురేష్‌గోపి కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చినపుడు ఆయనకు ఉమ్మడిప్రభుత్వంలోని భాగస్వామ్యపక్షాలు ఘనస్వాగతం పలికారు. మంత్రి ఆలయం వద్దకు రాగానే కార్యాలయం వద్ద బిజెపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్, శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు, బిజెపికి చెందిన జివి అమర్‌నాధ్ తదితరులు ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. కాగా దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఇఓ ఎన్‌వియస్ఎస్ మూర్తి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎస్ఓ నాగభూషణం యాదవ్ టెంపుల్ ఇన్సెపెక్టర్లు హరియాదవ్, సుదర్శనం నాయుడులు స్వాగతం ఏర్పాటు చేసారు.

# తిరుపతి డివిజన్

## ప్రతిభావంతులకు నగదు చెక్కుల పంపిణీ

ఒక్కో విద్యార్థికి రూ. పదివేలు నగదు ప్రోత్సాహం

పాకాల, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



పాకాల మండలం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్యూబ్ టూర్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. మహమ్మద్ రఫీ అధ్యక్షతన ఉన్నత చదువుల కొరకు ప్రోత్సాహం కలిగించే కార్యక్రమం నిర్వహించారు. పదవ తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు పంపిణీ చేస్తున్న క్యూబ్ రూట్ ఫౌండేషన్ వారి దయా హృదయానికి కృతజ్ఞతలు తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ ద్వితీయ స్థానంలో సత్తా చాటిన ఒక్కో స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు చొప్పున 28 మంది బాలబాలికలకు ఒక్కొక్కరికి పదివేల రూపాయిలతో పాటు సర్టిఫికెట్లు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏపిఐయు తిరుపతి ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేష్, క్యూబ్ రూట్ ఫౌండేషన్ నుంచి రవీంద్రనాద్ కరాటి, కెఎన్ఆర్ తిరుమల ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెట్ ప్రాజెక్ట్ హెడ్ స్వామి జ్వాల వరప్రసాద్, గోపికృష్ణ, డిప్యూటీ మేనేజర్, ఎన్‌హెచ్ ఏపీఐయు తిరుపతి, సురేష్ రేసిమెంట్ ఇంజనీర్లు, విద్యార్థులను అభినందించారు.

## పాకాల పోలీస్ స్టేషన్‌ను డిఎస్‌పి ఆకస్మిక తనిఖీ

పాకాల, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



పాకాల మండలం స్థానిక పాకాల పోలీస్ స్టేషన్‌ను బుధవారం చంద్రగిరి డిఎస్‌పి నర్సింగప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్‌ని పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా చంద్రగిరి డిఎస్‌పి నర్సింగప్ప మాట్లాడుతూ నేర నియంత్రణ చేస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావు లేకుండా ఉక్కుపాదం మోపి, శాంతిభద్రతల పరిరక్షణ చేయాలని తెలిపారు. సిఐలు, ఎస్ఐలు తమ పరిధిలో గల సమస్యాత్మక గ్రామాలను సందర్శించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి చట్టాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేయరాదని, మద్యం సేవించి వాహనాన్ని నడపరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ మద్దయ్యాచారి, ఎస్ఐ మహేష్ బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలకు నీటి ట్యాంకు, కొళాయిలు వితరణ

తిరుపతి విద్య సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:

ఏర్పేడు మండలంలోని పాతవీరాపురం అంగన్వాడీ ప్రై ప్రైమరీ పాఠశాలకు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల 500 లీటర్ల సామర్థ్యం ఉన్నటువంటి నీటి ట్యాంకును మరియు పిల్లల మరుగుదొడ్లకి కావలసినటువంటి నీటి కొళాయిలు, పైపులను వితరణ చేశారు. పాఠశాల పిల్లల కోసం ట్యాంకును వితరణ చేసిన దాత దాతృత్వానికి అంగన్వాడి ఉపాధ్యాయురాలు భువనేశ్వరి, ఇయా చెంచమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీ వెంకటేశ్వర వర్సిటీలో పి.జి సెట్-2024 సర్టిఫికేట్ల వెరిఫికేషన్

తిరుపతి విద్య, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి 2024 సంవత్సరానికి గాను వివిధ విశ్వవిద్యాలయాల్లో పి.జి కోర్స్ చేరడానికి నిర్వహించిన ఏ.పి.పి.జి సెట్ -2024లో ర్యాంకులు పొంది యస్వీయూలో ఫేస్-1 పి.జి సెట్లో సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 12-09-2024 వరకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ అడ్మిషన్స్ కార్యాలయానికి రావాలని విశ్వవిద్యాలయ డి.ఓ.ఏ తెలియజేస్తుంది. ఈ మేరకు శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం.భూపతి నాయుడు ఒక ప్రకటనలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు సర్టిఫికేట్లను పరిశీలించి, ఆరోజే ఫీజు చెల్లించుకుంటారని తెలిపారు. యస్వీయూలో పి.జి సెట్లో సీట్లు పొందిన విద్యార్థులందరూ ఆఖరి తేదీ అయిన 12-09-2024న స్టేట్ బ్యాంక్ మిద్దెపైన ఉన్న డైరెక్టరేట్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికేట్లతో రిపోర్ట్ చేయాలని వారు కోరారు.

## జంక్ ఫుడ్‌కు దూరంగా పిల్లలు

ఐసిడిఎస్ సిడిపిఓ పిఆర్ ప్రదీప

చంద్రగిరి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:




చిన్న పిల్లలను జంక్ ఫుడ్‌కు దూరం పెట్టాలని ఐసిడిఎస్ సిడిపిఓ పిఆర్ ప్రదీప తల్లిదండ్రులకు సూచించారు. జాతీయ పోషణ మాసోత్సవాలలో భాగంగా బుధవారం కొత్త శానంబట్లలో ఐసిడిఎస్, మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ (ఎంఆర్‌హెచ్‌ఆర్‌యు) సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఇంట్లో తయారు చేసే ఆహారాన్ని అందించాలన్నారు. బిస్కెట్లు చాక్లెట్లు, జంక్ ఫుడ్ వంటి వాటికి పిల్లలను దూరంగా పెట్టాలన్నారు. అదేవిధంగా ఎంఆర్‌హెచ్‌ఆర్‌యు శాస్త్రవేత్తలు డాక్టర్ జి.వెన్నెల సాహితి, డాక్టర్ యు.వి.ప్రసాద్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, నవజాత శిశువులు, చిన్నపిల్లలు, కిషోర బాలికలకు అందించాల్సిన పోషకాహారాన్ని వివరించారు. పోషకాహార లోపం వలన కలిగే వ్యాధులు, పిల్లల ఎదుగుదలలో వచ్చే సమస్యల వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టి.నాగమణి, వాసుదేవ, చందన, చంద్రశేఖర్, పాఠశాల హెచ్ఎం గీతాంజలి, రెడ్డి ప్రసాద్, స్వర్ణ కుమారి, అశ్విని, అంగన్వాడీకార్యకర్తలు ప్రభావతి, గంగమణి, శ్రీదేవి, మల్లీశ్వరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం ర్యాలీ

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త




ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా రుయా ప్రాంగణంలో ఎస్వి వైద్య కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. మానసిక విభాగం ప్రొఫెసర్స్ హెచ్ఓడి రాధాకృష్ణన్ రాజు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున రావు, డాక్టర్ ఆర్ భూపాల్ నాయుడు, డాక్టర్ కిషోర్ డాక్టర్, భారతి, డాక్టర్ కవిత, డాక్టర్ జాహ్నవి డాక్టర్ మానస, డాక్టర్ మురళి, నర్సింగ్ కాలేజ్ లెక్చరర్ సౌభాగ్య లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జున రావు మాట్లాడుతూ ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10 నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆత్మహత్యలను నివారణ కోసం ప్రజల్లో అవగాహన కలిగించడానికి 2003లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ మొదటి కార్యక్రమం పిల్లల్లో ఆత్మహత్య నివారణ తగ్గించడానికి వివిధ కార్యక్రమాలు, ఒక్క వారం రోజులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 1999లో ప్రపంచ ఆత్మహత్యల నివారణకు చూపిన చొరవ ఎంతో ఉపయోగకరంగా ఉందని ఆయన తెలిపారు. అనంతరం డాక్టర్ కవిత మాట్లాడుతూ 2014లో విడుదల చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ మానిక ఆరోగ్య నివేదిక ప్రకారం, తక్కువ ఆదాయం ఉన్న దేశానికి జాతీయ ఆత్మహత్యల నివారణ ప్రణాళిక లేదని తెలిపారు. డాక్టర్ జాహ్నవి మాట్లాడుతూ తక్కువ మధ్య తరగతి ఆదాయపు దేశాలలో 10 శాతం కన్నా తక్కువగా, ఎగువ మధ్య, అధిక ఆదాయ దేశాలలో దాదాపు మూడవ వంతుగా ఉన్నట్లు నివేదించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మాట్లాడుతూ కెరీర్ యొక్క ఉపయోగాలు ఆత్మహత్యలు నివారించడానికి మనం ఎలాంటి ప్రణాళికలు తీసుకోవాలని ఎవరెవరికి అవగాహన కార్యక్రమం నిర్వహించాలి, మెంటల్ హెల్త్ స్టేటస్ గురించి వారి యొక్క సందేహాలను క్లారిటీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి యూజీ, పీజీ విద్యార్థిని, విద్యార్థులు నర్సింగ్ కళాశాల విద్యార్థులు, డాక్టర్ పవన్ డాక్టర్, మురళీ నాయక్, డాక్టర్ రోహిత్, డాక్టర్ రాఘవ డాక్టర్ వెంకట రత్నాలు డాక్టర్ సుహాని డాక్టర్ షఫీ, డాక్టర్ ప్రియంక, డాక్టర్ ప్రియదర్శిని ఈ కార్యక్రమం మానసిక విభాగం సిబ్బంది, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం సిబ్బంది డాక్టర్ జి. మురళి, రమణయ్య, ఒంకారి, గీత తులసి గోపి సిబ్బంది, ఎస్వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

## 17న రాస్‌లో విశ్వకర్మ జయంతి

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

ప్రతి ఏడాది జరుపుకునే శ్రీశ్రీశ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి పూజ మహోత్సవాన్ని ఈ ఏడాది స్థానిక



బైపాస్ రోడ్డులోని రాయలసీమ అభ్యుదయ సేవా సమితి నందు ఈ నెల 17వ తేది మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం ఆహ్వాన కమిటీ సభ్యులు ఉమాపతి ఆచారి, నాగేశ్వరాచారి, చేజర్ల మనోహర్ ఆచారి తదితరులు పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మీడియా ముందు వారు మాట్లాడుతూ ఈ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లాలోని పంచ వృత్తుల వారికి పిలుపునిచ్చారు. వీరంతా ఒక తాటిపై నిలబడి కులవృత్తులను కాపాడాలని కోరారు.

**CHANGE OF NAME**

I,**SHAIK KATTUBADI MOQTIRA BEGAM,** (old Name)R/ at H.No.10-10-9,Rangareddy Colony, Kotha Indlu, Madanapalle, Annamayya Dt, AP. I have Changed my name to (New Name) **SHAIK MOQTIRA BEGUM** W/o **SHAIK KTTUBADI KHADAR BASHA.**

I,**SHAIK KATTUBADI MOHAMMED,SAIF** (old Name),PPT No.L9300504, R/at H.No:10-10-9, Rangareddy Colony, Kotha Indlu, Madanapalle, Annamayya Dt, AP. I have Changed my name to (New Name) **KATTUBADI SHAIK MOHAMMED, SAIF** S/o **SHAIK KATTUBADI KHADAR BASHA.**

I,**SHAIK KATIUBADI MOHAMMED SAHIL** (old Name), PPT No.L 9300517, R/at H.No:10-10-9, Rangareddy Colony, Kotha Indlu, Madanapalle, Annamayya Dt, AP. I have Changed my name to (New Name) **SHAIK KATTUBADI MOHAMMED SAHIL** S/o **SHAIK KATTUBADI KHADAR BASHA.**

# అట్టహాసంగా వినాయక నిమజ్జనం

## రూ. 3.10 లక్షలు పలికిన లడ్డు

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



తిరుపతి నగర పాలక సంస్థలో బుధవారం సాయంత్రం వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్. మౌర్య, కార్పొరేటర్ ఆర్.సి మునికృష్ణ తదితరులు ముందుగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి వద్ద ఉంచిన లడ్డు వేలం పాట నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన ఈ వేలం పాటలో ఇంజినీరింగ్ విభాగం వారు 3.10 లక్షల రూపాయల హెచ్చు పాటపాడి లడ్డును దక్కించుకున్నారు. ఇంజినీరింగ్ విభాగపు అధికారులను మేయర్, కమిషనర్ లడ్డును అందజేశారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఐదు రోజులు పాటు ఘనంగా పూజలు నిర్వహించామని అన్నారు. ఐదవ రోజైన బుధవారం సాయంత్రం నిమజ్జన కార్యక్రమం నిర్వహించామని అన్నారు. మున్సిపల్ కార్యాలయం నుండి ఊరేగింపుగా వెళ్లి వినాయక సాగర్‌లో అంగరంగ వైభవంగా నిమజ్జనం చేశారు. ఈ నిమజ్జన వేడుకల్లో కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, అదనపు కమీషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి, సెక్రటరీ రాధిక, డిసిపి శ్రీనివాసులు రెడ్డి, ఆర్‌ఓలు సేతుమాధవి, కెఎల్ వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మేనేజర్ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కోటలో భారీ ర్యాలీ

కోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త

కోటలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కోట క్రాస్‌రోడ్డు నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు వందలాది మంది దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. నాయకులు మీజూరు మాధవ్, అరవ పార్వతయ్య, మోహన్ అంబేడ్కర్ (లాయర్), విజయకుమార్, ఉయ్యాల రామకృష్ణ, డాక్టర్ రవికుమార్‌లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అన్ని కులాల్లోకెల్లా ఎక్కువ శాతం ఉన్న మాలలను దోపిడీదారులుగా సృష్టించడంలో మాదిగ దండోరాను అగ్రకుల రాజకీయ పార్టీలు పావులుగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. ఎప్పటికీ బహుజన రాజ్యాధికారం రానివ్వకుండా అగ్రకులాలు అడ్డుతగులుతున్నాయని చెప్పారు. సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పు చాలా బాధాకరమన్నారు. ఈ తీర్పును రద్దు చేసే వరకు నిరంతరం వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉద్యమాలు చేస్తూనే ఉంటుందని చెప్పారు. సుప్రీం కోర్టు నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరుతున్నట్లు చెప్పారు. రాజకీయ మనువాద కుట్రలతో న్యాయమూర్తులలో ఉండటం బాధాకరమన్నారు. 59 ఎస్సీ కులాలు జాబితాలో కేవలం మాల, ఆదిఆంధ్రా, మాలదాసరి, ద్రవిడ, మాదిగ అరుంధతీయ, మాదిగ దాసు ఐదు జిల్లాలకే పరిమితమైన కులాలు ఉన్నాయన్నారు. సుప్రీం కోర్టు వర్గీకరణ తీర్పును దేశ వ్యాప్తంగా ఎస్సీలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అశోక్ కాంబ్లే, వసంత్, కృష్ణయ్య, కేశవ్, హేమంత్, శ్రీనివాసులు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో జాతరను జరుపుకోవాలి

### మాజీ ఎస్వి బీసీ ఛైర్మన్ సాయి కృష్ణ యాచేంద్ర

వెంకటగిరి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే వెంకటగిరి గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతరను అందరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మాజీ శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ ఛైర్మన్ డాక్టర్ వివి సాయి కృష్ణ యాచేంద్ర తెలిపారు. పోలేరమ్మ జాతరను నిర్వహించేందుకు ఆలయం ఈవో ఆర్‌వో భూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, జాతర నిర్వాహకులు రాజాల నుండి తాంబులాలను స్వీకరించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ జాతరను మా పూర్వీకుల నుండి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నేతృత్వంలో జరుగుతున్న జాతరలో అందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయం ఈవో ఆర్‌వో భూమి శ్రీనివాసరెడ్డికి పూలమాలవేసి తాంబూలం అందించారు. ఈ రోజు నుండి జాతర పూర్తయ్యే వరకు పట్టణంలో ఎలాంటి శుభకార్యాలు చేయరు. ఈ నెల 26వ తేది పైన యధావిధిగా శుభకార్యాలను సర్వజ్ఞకుమార యాచేంద్ర, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బీరం రాజేశ్వర రావు, సిఐ ఏ. వెంకటరమణ, నిర్వాహకులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీపార్థివగణపతి నిమజ్జనం

పుంగనూరు, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :



పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో ఏర్పాటుచేసిన శ్రీపార్థీవగణపతి నిమజ్జన కార్యక్రమాలు బుధవారంర వైభవంగా నిర్వహించారు. గత ఐదురోజు లుగా స్వామివారికి నిత్యఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారులు సుబయ్యదీక్షితులు, రామస్వామి దీక్షితుల అధ్వర్యంలో నిర్వహించిన పార్థీవవినాయకచవితి ఉత్సవాలను శ్రీవారాహీయువజన సంఘ సభ్యుల సహకారం అందించారు. కాగా పట్టణంలో పలుచోట్ల వెలసిన విఘ్నునాధుని ప్రతిమలను బుధవారం నిమజ్జనం చేశారు.

## రూ.2లక్షలకు వేలంపాటలో లడ్డును దక్కించుకొన్న ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:



చిత్తూరునగరం, బజారు వీధిలో బంగారు వ్యాపారులు ఏర్పాటుచేసిన వినాయకుని నిమజ్జనం సందర్భంగా బుధవారం స్వామి వారికి ప్రసాదంగా సమర్పించిన లడ్డును వేలం పాట నిర్వహించారు. అ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ రూ. 2లక్షలకు వేలం పాటలో లడ్డును దక్కించుకొని భక్తులకు అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చెరుకూరి వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన శ్రీశ్రీశ్రీ కట్ట పుట్టాలమ్మ జాతర

రేణిగుంట, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



రేణిగుంట మండలం కరకంబాడిలో కొలువు తీరిన శ్రీశ్రీశ్రీ కట్టపుట్టాలమ్మ జాతర బుధవారం ఘనంగా ముగిసింది. అమ్మవారిని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, డాలర్స్ దివాకర్ రెడ్డి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ కట్ట పుట్టాలమ్మ దేవస్థానం వద్ద విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని సేవించుకున్నారు. నిర్వాహకులు అమ్మతల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. నిర్వాహకులు కేవీచలం, పాడి రాజేంద్ర, శ్రీనివాసులు, మోహన్ బాబు, సుధాకర్ తదితరులతో పాటు టిడిపి సీనియర్ నేత బుజ్జి నాయుడు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా రేణిగుంట డిఎస్పి వెంకటాద్రి ఆదేశాల మేరకు అర్బన్ సిఐ సతీష్, చంద్ర తమ సిబ్బందితో పర్యవేక్షించారు.

# వైభవంగా అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం





కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం జరిగిన చిన్నశేషవాహనం, బంగారు పెద్ద శేషవాహనసేవ సందర్భంగా ఉభయదారులచే స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈమేరకు ఉదయం కాణిపాకం, కాకర్లవారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టయిండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, బొమ్మ సముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాలతో వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన కమ్మవ ఒశస్థులు స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకంను నిర్వహించారు. వీరు రాష్ట్రంలోనే పేరొందిన ప్రముఖ కళాకారుల కోలాటాలు, చెక్కభజనలు, విచిత్ర వేషధారణ, పలు రకాల నృత్యాలు వంటి వైవిధ్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు నడుమ స్థానిక మణికంఠేశ ్వరాలయం నుండి సుమారు వెయ్యి కలశాలతో గ్రామపురవీధుల గుండా ఊరేగిం పుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలో అర్చకులు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకారమండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వుంచి వేదపండితుల మంత్ర ఘోష నడుమ అష్టోత్తర శత కలశాలలోని పాలతో ఘనంగా అభిషేకించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు చేసి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. .ఈకార్యక్రమంలో పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్‌మోహన్, ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, డిప్యూటీ ఈఓ కె.వాణి, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ ఉభయదారుల కమిటీ ఛైర్మన్ ఈశ్వర్ బాబు, జడ్పీటీసీ సుచిత్ర, మాజీ జడ్పీటీసీ లత, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మదుసూధన్ రావు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు రవి, విఘ్నేష్, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

**కోలాటలు వేసిన పూతలపట్టు ఎమ్మెల్యే**

అస్టోత్తర శత కలశ క్షీరాభిషేకం కార్యక్రమంకు ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక కలికిరి మురళీమోహన్ ప్రముఖ కోలాట కళాకారులతో కలసి కోలాటావు వేసి అందరిని అలరించారు.

### చిన్నశేషవాహనంపై

## శివపుత్రుని చిద్విలాసం

కాణిపాకం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:



కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సర్వాలాంకృతుడైన స్వామివారు ఉభయదేవేరులతో కలసి చిన్నశేషవాహనంపై అధిరోహించి భక్తులకు అభయ హస్తం అందించారు. ఉదయం ఉత్సవ ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలను నిర్వహించి శోభాయమానంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే సిద్ధి, బుద్ధి సమేత గణనాధుడు దేదీప్యమానంగా అలంకరించిన చిన్నశేషవాహనంపై అధిరోహించి మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. ఈకార్యక్రమంలో పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్‌మోహన్, ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, డిప్యూటీ ఈఓ కె.వాణి, ఆలయ ఉభయదారుల కమిటీ ఛైర్మన్ ఈశ్వర్‌బాబు, జడ్పీటీసీ సుచిత్ర, మాజీ జడ్పీటీసీ లత, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు రవి, విఘ్నేష్, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గొడుగులు వితరణ



కాణిపాకం స్వామివారి బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన శేషవాహనసేవ సందర్భంగా దాతలు గొడుగులను ఆల యానికి విరాళంగా అందజేశారు. ఈమేరకు చిత్తూరుకు చెందిన కుమారస్వామినాయుడు అనే భక్తుడు స్వామివారికి నాలుగు గొడుగులకు అందజేశారు. వీటిని పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్‌మోహన్, ఈఓ పట్టెం గురుప్రసాద్‌లకు అందజేశారు. దాతకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉత్సవ ఉభయదారులు పాల్గొన్నారు.

## హోరెత్తించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం జరిగిన శేషవాహనసేవ సందర ్భంగా ఏర్పాటు చేసిన వైవిధ్యభరితమైన సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలతో కాణిపాకం హోరెత్తింది. బుధవారం ఉదయం చిన్నశేవాహనం, రాత్రి బంగారు పెద్ద శేషవాహనసేవలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ధార్మికోపాన్యాసము, హరికథలు, భక్తిగీతాలు, కూచిపూడి, భరత నాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు, లంబాడి నృత్యాలు ఎంతో అలరించాయి.

## కుప్పం ప్రాంతంలో విద్యాకిరణం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ - 23 ఏళ్ల ప్రస్థానంలో అటానమస్ హోదా !!

కుప్పం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



కుప్పం లాంటి మారుమూల ప్రాంతంలో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ పేద విద్యార్థుల పాలిట విద్యాకిరణంగా ముందుకు సాగుతోంది. 11-9-2001లో సిఎం చంద్రబాబునాయుడు కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌ను ప్రారంభించారు. నాటినుంచి నేటి వరకు 23 ఏళ్ల ప్రస్థానంలో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ఉత్తమ విద్యాబోధనతో ఉత్తమ స్థాయిలో ఫలితాలు సాధిస్తూ స్వయంప్రతిపత్తి(అటానమస్) హోదాను సాధించింది. బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ నేతృత్వంలో కళాశాల అంచెలంచెలుగా ఎదిగింది. కళాశాలలో ఉన్న ఉన్నత స్థాయి వసతులకు తగు గుర్తింపుగా ఎన్‌బిఎ ద్వారా ఐఎస్‌ఒ 9001:2008 సర్టిఫికెట్ సాధించడంతో పాటు నాక్ 'ఎ' గ్రేడ్‌ను సైతం సాధించింది. కళాశాల వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ తన తండ్రి బిసి నాగరాజ్ మార్గదర్శకత్వంలో కళాశాలను ఉన్నతస్థాయికి తీర్చిదిద్దారు. 55 ఎకరాల విసీ ్ణంలో ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటైన ఈకళాశాలలో బిటెక్ కోర్సులతో పాటు డిప్లమో, పిజి కోర్సులను సైతం నిర్వహిస్తున్నారు.

**గ్రామీణ విద్యార్థులను ఇంజనీర్లుగా తీర్చిదిద్దడం ఆనందంగా ఉంది - బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్**

కుప్పం నియోజకవర్గంలో ఒకప్పుడు ఉన్నత చదువులు చదవాలంటే ఆసక్తి చూపేవారు కాదు. అలాంటి ప్రాంతంలో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌ను 2001లో స్థాపించాము. నాటినుంచి నేటివరకు 23 ఏళ్ల ప్రయాణంలో వేలాది మంది విద్యార్థులను ఇంజనీర్లుగా తీర్చిదిద్దడం ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో మరో రెండేళ్లలో మా కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను జరుపుకుంటుంది. పేద విద్యార్థులకు అండగా నిలిచి సమాజానికి పోటీతత్వం కలిగిన ఇంజనీర్లను అందిస్తాము.

## ఘనంగా ఎంపీ మిధున్‌రెడ్డి జన్మదిన వేడుకలు

సదుం, సెప్టెంబరు 11 ప్రభాతవార్త



సదుంలో బుధవారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిదున్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బస్టాండులోని వైఎస్సార్ సర్కిల వద్ద మిధున్‌రెడ్డి బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ 47 కిలోల కేక్‌ను తీసుకువచ్చి కట్ చేసి అందరికి పంచి పెట్టారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మిధున్ రెడ్డి మరిన్నిపుట్టిన రోజువేడుకలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, వైఎస్ ఎంపీపీలు అమరావతి పుత్రాజు, ధనంజయరెడ్డి, వైకాపా మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జెసీస్ మండల కన్వీనర్ నాలి ప్రకాష్‌రెడ్డి, సర్పంచిలు హనుమంతురెడ్డి, ఉషారాణి, వైకాపా నాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, శివారెడ్డి, ఆనందరెడ్డి, షబ్బీర్, చిన్నా, జీవీ రమణ, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు

కుప్పంరూరల్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి సిఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నడిమూరు పంచాయతీ బోదగుట్టపల్లి ఎస్సీ కాలనీలో నూతన డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఇదివరకే గ్రామ వికాస పత్రాలు రూపొందించినట్లు తెలిపారు. వీటి ద్వారా గ్రామాల సమగ్ర అభివృద్ధికి గాను అంశాల వారీగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, రాష్ట్ర నేత వైద్యం శాంతారాం, యువనేత జెకెసంతోష్, సర్పంచ్ మాదమ్మ, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యే ంద్రశేఖర్, నేతలు

## సక్కుబాయమ్మకు పలువురు ప్రముఖుల నివాళులు





విజయపురం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త

రాష్ట్ర టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్క ధనుంజయ యాదవ్ మాతృమూర్తి సక్కుబాయమ్మకు బుధవారం మండల కేంద్రమైన విజయపురంలో కర్మక్రియల సందర్భంగా పలు ప్రముఖ రాజకీయ నాయకులు ఆమె చిత్రపటానికి పూలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ చాంబర్ వ్యవస్థాపక అధ్యక్షుడు వై.వి.బి.రాజేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి బిరునప్రతాపరెడ్డి, తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు నరేంద్ర, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మిముత్యాలు, ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్, ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, వానపల్లి ముత్యాలరావు, లెనిన్‌బాబు, కార్యదర్శులు దేవారెడ్డి, నాగేంద్రరెడ్డి, కుప్పాల మురళి, గోపిరెడ్డి, వెంకటేష్ యాదవ్, చిత్తూరు పార్లమెంట్ టిడిపి అధికారప్రతినిధి చినబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రమణ్యం రాజు, మండల టిడిపి అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, బిజెపి నాయకులు చిలకం ఈశ్వరప్రసాద్, గాలిగోపినాయుడు, షణ్ముగంరెడ్డి, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, నాయకులు గుణభూషణమ్మ, సుధానాయుడు, దశరథరాజు, శివలింగం, మునిభాస్కర్‌రాజు, నాగభూషణం యాదవ్, పరంధామనాయుడు, నింద్ర, పుత్తూరు, వడమాలపేట మండల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పలువురు పాల్గొన్నారు.

## గుడిమల్లం పరశురామేశ్వర స్వామిని సందర్శించిన కేంద్ర మంత్రి కుటుంబ సభ్యులు

ఏర్పేడు, సెప్టంబరు 11, ప్రభాతవార్త



గుడిమల్లం పరశురామేశ్వర స్వామి వారి దేవస్థానానికి రోజు రోజుకు ప్రముఖుల రాకతో సందడి నెలకొంటున్నది. తమిళ, మలయాళ సినీ నటులు కేంద్ర పెట్రోలియం, కెమికల్స్ గ్యాస్, టూరిజం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్న ఆలయ ఛైర్మెన్ గిరి నాయుడు, ఆలయ అధికారులు, అర్చకులు వేద ఆశీర్వచనం నిర్వహించి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఛైర్మెన్ గిరిబాబు నాయుడు మాట్లాడుతూ భక్తులకు మౌళిక వసతుల కల్పనలో భాగంగా ఆలయం చుట్టూ ల్యాండ్ అక్విజేషన్‌కు రూ. 4కోట్లు, వసతి గృహాల నిర్మాణం కొరకు రూ.5 కోట్లు, అన్నధానం కాంప్లెక్స్ నిర్మాణం కొరకు రూ. 2.5కోట్లు, పాపానాయుడపేట నుంచి గుడిమల్లం వరకు రోడ్డు నిర్మాణం కొరకు రూ . 4కోట్లు, కోనేరు, పుష్కరిణి అభివృద్ధి పనులకు రూ.3కోట్లు, ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి రూ. 1కోటి రూపాయలు, బస్సు సెల్టర్ నిర్మాణానికి రూ. 75లక్షల రూపాయలు, కాపౌండ్ వాల్ నిర్మాణానికి రూ. 1కోటి, గోశాల మండపం నిర్మాణానికి రూ.2కోట్ల రూపాయల పనులకు సంబంధించి మొత్తం రూ.23.25కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# అశ్లీల నృత్య ప్రదర్శనలపై కేసు నమోదు

## ఏడుగురు నిర్వాహకులు అరెస్టు

### జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త

వినాయక చవితి ఉత్సవాలలో అశ్లీల నృత్యాలకు తావు లేదని, పోలీస్ నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపడుతామని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు పేర్కొన్నారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సప్తగిరి నగర్ వినాయక స్వామి మండలం వద్ద యువతులతో రికార్డింగ్ డాన్స్ తరహాలో అశ్లీల నృత్యాలు ప్రదర్శించినట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారం పై జిల్లా ఎస్పి సుబ్బరాయుడు తీవ్రంగా పరిగణించి, అలిపిరి పోలీసులను కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు తిరుపతి డిఎస్పీ వెంకటనారాయణ పర్యవేక్షణలో, అలిపిరి సిఐ రామ్ కిషోర్ ఆధ్వర్యంలో ఘటనకు సంబంధించిన ఏడు మంది నిర్వాహకులు జె. మధుసూధన్ రెడ్డి, ఎం. రాజేంద్రప్రసాద్, ఎం. వినోద్ కుమార్, జి. కిరణ్ కుమార్, జస్వంత్ రెడ్డి, పి. వినయ్, హేమంత్‌లపై కేసులు నమోదు చేసి, వారిని ఇప్పటికే అరెస్టు చేశారు. ఈ నెల 9వ తేది 9 గంటలకు వెలుపల నుండి వచ్చిన మహిళలతో విగ్రహం ముందు అశ్లీల నృత్యాలు నిర్వహించినందుకు వీరిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పోలీసు నిబంధనలు అతిక్రమించి, ఉత్సవాల్లో దురాచారాలకు తెరలేపిన వారిపై కఠిన చర్యలు తప్పవు, అందువల్ల ఎవరూ ఇటువంటి చర్యలకు పాల్పడకుండా తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. వినాయక చవితి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో సాగాలి ఇలాంటి దురాచారాలు భక్తుల మనోభావాలను దెబ్బతీయకూడదన్నారు. గణేష్ మండపం వద్ద జరిగే ఏదైనా ఘటనకు పూర్తిగా నిర్వాహకుల బాధ్యతే ఉంటుంది. వినాయక మండపాల వద్ద మరింత నిఘా ఉంచి, ఇలాంటి ఘటనలను అరికడతామన్నారు. ప్రజలందరూ వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని కోరుతున్నామన్నారు. పోలీస్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని తిరుపతి డిఎస్పి వెంకట నారాయణ హెచ్చరించారు.

# శ్రీకాళహస్తి అభివృద్ధికి పర్యాటక శాఖ రూ.110 కోట్లు నిధులివ్వండి

## కేంద్ర మంత్రికి ఎంఎల్ఏ మొర

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయాభివృద్ధికి భక్తుల సదుపాయాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనానికి వచ్చిన కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి, పర్యాటకశాఖ మంత్రి, సినీ నటుడు సురేష్‌గోపికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి తరపున తెలుగుదేశం బిజెపి నాయకులు వినతి పత్రాన్ని అందించారు. పర్యాటకంగా శ్రీకాళహస్తీశ్వరాలయం పరిసరాల్లో అభివృద్ధికి పనులకు సంబంధించి గతంలో కూడా విన్నవించామన్నారు. ఈ సందర్భంగా ఓ వినతి పత్రాన్ని అందిస్తూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న లోబావిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రతిపాదనలు అందించారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని గుడిమల్లం ఆలయాభివృద్ధికి రూ.23.2కోట్లు కేటాయించాలన్నారు. ఆలయం చుట్టూ ఉన్న భూముల్లో గ్రీనరీకికి రూ.4కోట్లు కాటేజీల నిర్మాణానికి రూ.5కోట్లు, అన్నదానంకు రూ.2.5కోట్లు పాపానాయుడుపేట నుంచి గుడిమల్లం ఆలయం వరకురోడ్డుకు రూ.4కోట్లు, పుష్కరిణి అభివృద్ధికి రూ.3కోట్లు మంచినీటి సదుపాయానికి రూ.కోటి బస్ షెల్టర్ నిర్మాణానికి రూ.75లక్షలు, ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.,కోటి ,గోశాల రూ,.2కోట్లు మంజూరు చేయాలని కోరారు. భరద్వాజ తతీర్థంలో రోప్‌వే ఏర్పాటుకు మెషనరీ కొనుగోలుకు రూ.41.85 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ నిధులతో భక్తకన్నప్ప కొండపై నుంచి దుర్గమ్మ కొండపైకి రోప్‌వే నిర్మాణాల ప్రతిపాదన ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉందని మంత్రికి వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రతి రోజూ కనీసం 40వేల మంది వస్తుంటారు. ఇక్కడి అవసరాల దృష్ట్యా ఇక్కడ ఎమినిటీ సెంటర్ ఏర్పాటుకు కే,2.24కోట్లు రాబోవు రోజుల్లో భక్తుల తాకిడిని తట్టుకునే రీతిలో క్యూలైన్లను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఇందుకు కొత్తక్యూలైన్ల ఏర్పాటుకు రూ.3.72కోట్లు గ్రానైట్ ఫ్లోరింగ్‌కు రూ.75లక్షలు మహా ప్రాకారం నిర్మాణానికి రూ.30కోట్లు మంజూరు చేయాలని నివేదికలను మంత్రి సురేష్‌గోపికి అందించారు. ఈ వినతి పత్రాన్ని తెలుగుదేశం పార్టీకి చెందిన రంగినేని చెంచయ్యనాయుడు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్‌లు అందించారు.